విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 10, జనవరి 2025

విద్యార్థి చికిత్సకు లిటిల్ ఏంజిల్స్ చేయూత

విశాలాంధ్ర - వెలుగోడు: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వెలుగోడు ఏపీ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి వహీద్ బాషకు లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అండగా నిలిచారు. తీవ్ర అనారోగ్యం పాలై కర్నూలు పట్టణంలోని శ్రీ చక్ర హాస్పిటల్ ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్నాడు. రోజుకు 70 వేల రూపాయలు ఖర్చు అవుతుందని తల్లిదండ్రులు వాపోయారు. వెలుగోడుకు చెందిన ప్రజలు, ఉద్యోగస్తులు, ఏపీ మోడల్ స్కూలు ఉపాధ్యాయ బృందము తోడుగా నిలిచి ఆర్థిక సాయం అందజేశారు. లిటిల్ ఏంజెల్స్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మేమున్నామని తోడుగా నిలిచి విరాళాల ద్వారా సేకరించిన 20వేల రూపాయలను కరెస్పాండెంట్ డాక్టర్ ఎంఎఫ్ ఇమ్మానియేల్ ద్వారా తండ్రి చాంద్బాషాకు గురువారం అందజేశారు.

పంచాయతీ వేలం పాటల బకాయిదారులకు నోటీసులు జారీ

విశాలాంధ్ర - శిరివెళ్ల: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ బహిరంగ వేలం పాటలకు సంబంధించిన బకాయిల రికవరీ కోసం నోటీసులు జారీ చేసినట్లు ఈవో అశ్విని కుమార్ అన్నారు. శిరివెళ్ల మేజర్ పంచాయతీ వేలం పాటలకు సంబంధించి 2014 నుండి 2023 వరకు రూ.28 లక్షల బకాయి ఉన్నట్లు తెలిపారు. దినమార్కెట్, సంత మార్కెట్, కబేలా మార్కెట్లకు సంబంధించి 28 లక్షలు బకాయి ఉండగా ఆర్‌ఆర్ యాక్ట్ ప్రకారం నోటీసులు జారీ చేశామన్నారు. గ్రామపంచాయతీకి బహిరంగ వేలం పాటల ద్వారా బకాయిలు పడ్డ ఏడు మందికి నోటీసులు జారీ చేశామని నోటీసులకు స్పందించని పక్షంలో తదుపరి న్యాయపరమైనటువంటి ఆర్‌ఆర్ యాక్ట్ చర్యలకు గ్రామపంచాయతీ సిద్ధమవుతుందని ఈ సందర్భంగా ఈవో అశ్విని కుమార్ తెలియజేశారు.

శ్రీ రాజరాజేశ్వరి పాఠశాలలో ఎల్లో డే..

విశాలాంధ్ర - గడివేముల : స్థానిక శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో ఎల్లో డే దినోత్సవమును అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండంట్ రామేశ్వరావు మాట్లాడుతూ వేడుకలో ప్రతి తరగతిలోని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నరన్నారు. నర్సరీ నుండి 5వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు ఎల్లో కలర్ డ్రెస్ వేసుకుని రావడం వలన ఈ వేడుక పండుగల జరిగిందని,పసుపు రంగును, దాని సానుకూల అనుబంధాలను హైలెట్ చేయడానికి పాఠశాలలో ఎల్లో డేను జరిపించామన్నారు. పసుపు రంగు ఆనందం, శక్తి ఆశావాదం వంటి భావాలను ప్రేరేపిస్తుందన్నారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా కల్చరల్ ఆక్టివిటీస్ లో పాల్గొన్నారు. ఏఓ ఎంబిఎన్ రాఘవేంద్రరావు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడు మృతి

విశాలాంధ్ర - ఆత్మకూర్ రూరల్: ఆత్మకూరు పట్టణంలోని కిషన్ సింగ్ వీధికి చెందిన మాజీ సైనికుడు ఎం.సలాంబాష అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ సైనికుల సంఘం ప్రెసిడెంట్ ప్రభాకర్ శెట్టి, సంఘం సభ్యులు మృత దేహంపై భారతీయ చిత్రపటాన్ని ఉంచి నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

మల్లన్న 23 రోజుల హుండీ ఆదాయం

విశాలాంధ్ర - శ్రీశైలం: ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైల మహా క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు గత 23 రోజుల నుంచి భక్తులచే సమర్పించబడిన కానుకలను గురువారము సీసీ కెమెరా నిఘ సమక్షంలో మరియు పోలీస్ సెక్యూరిటీ సిబ్బంది ఆలయ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో లెక్కించటం జరిగింది. ఈ లెక్కింపులో రూ.3,39,61,457 నగదు, 139 గ్రాముల రెండు వందల మిల్లి గ్రాముల బంగారు, 5 కేజీల 400 గ్రాముల వెండి, వివిధ పలు విదేశీ దేశాలకు సంబంధించిన డాలర్లు స్వామి అమ్మవార్లకు రాబడిగా లభించాయని కార్య నిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపాడు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - మిడుతూరు: మండల కేంద్రంలోని స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ హై స్కూల్ నందు గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో ఏర్పాటు చేసిన రంగోలి, గాలిపటాల పోటీలను ప్రారంభించారు. విద్యార్థులలో సంక్రాంతి పండుగ ఉత్సాహాన్ని పెంచేలా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం మంచిదనీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి : సీపీఐ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: రాష్ట్ర సమితి పిలుపు మేరకు అర్హులైన లబ్ధిదారులకు పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని గతంలో గ్రామ వార్డు సచివాలయంలో సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్న ఈ విషయాన్ని పెడచెవిన పెట్టడం పట్ల ఆగ్రహించిన సిపిఐ నాయకులు శుక్రవారం సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నంద్యాల తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనుంది. అర్హులైన ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ పిలుపునిచ్చారు.

ఫణీంద్ర కుమార్‌ను అభినందించిన రాజారెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలం పసుపుల గ్రామానికి చెందిన ఫణీంద్ర కుమార్ రీసైక్లింగ్ ఆర్ట్‌లో కనబరిచిన ప్రతిభ కు రెండో సారి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించారు. ఈ సందర్భంగా బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి గురువారం ఫణీంద్రకుమార్‌కు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం బిసి రాజారెడ్డి మాట్లాడుతూ ఫణీంద్రకుమార్ రీసైక్లింగ్ లో అద్భుత ప్రతిభ కనబరుస్తుండటం అభినందనీయమన్నారు. ఖాళీ సిగరెట్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ బాటిల్స్, ఫ్యాబ్రిక్స్ తదితర వ్యర్థాలతో 210 ఫీట్ 7 ఇంచుల డీఎన్ఏ మోడల్ చేసి రెండో సారి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సాధించాడన్నారు. ఫణీంద్ర కుమార్ భవిష్యత్‌లో మరెన్నో ప్రజోపయోగ పర్యావరణ ప్రయోగాలు చేసి రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఇప్పటి వరకు ఫణీంద్రకుమార్ అధికారికంగా నాలుగు రికార్డులు సొంతం చేసుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఇంతకుముందు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించాడన్నారు. అదే విధంగా 2023 డిసెంబర్ 29న పంజాబ్ అమృతసర్ లోని గురునానక్ ఆడిటోరియం లో జరిగిన ఇంటర్నేషనల్ అవార్డు షో లో అవార్డు అందుకున్నాడని తెలిపారు. ఫణీంద్ర రీసైకిల్ ఆర్టిస్ట్, రైటర్‌గా రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఫణీంద్ర చాలా సిన్సియర్‌గా రీసైక్లింగ్ గురించి సమాజంలో అవగాహన పెంచడానికి ప్రయత్నం చేస్తున్నాడని అందరూ అతన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటా శివశంకర్, భాస్కర్, విష్ణువర్ధన్ రెడ్డి, మణికంఠ పాల్గొన్నారు.

బస్టాండ్‌ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోండి : సీపీఐ

విశాలాంధ్ర - డోన్: మండలంలోని యాపదిన్నె గ్రామంలో గ్రామ ప్రజల బస్టాండ్‌కి అవసరాల కోసం ఉన్న ఖాళీ స్థలాన్ని నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు కోరారు. గురువారం సిపిఐ నాయకులు తహశీల్దార్ నాగమణికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ మాట్లాడుతూ యాపదిన్నె గ్రామం 1999లో గ్రామంలో ప్రజల సౌకర్యం కోసం 770/బి విస్తీర్ణములో 96 సెంట్లు ఆర్టీసీ బస్టాండ్ కోసం వదిలి మిగతా ప్లాట్లు వేసి ప్రజలకు ఇచ్చారని తెలిపారు. అప్పటినుండి అదే స్థలము నుండి ప్రజలకు డోనుకు వెళ్లే ఆటో బస్టాండ్ ఏర్పాటు చేశారు. గ్రామప్రజలు వినియోగించుకున్నందుకు 31 నెంబరు నివాసముంటున్న ఈడిగ ప్రమీలమ్మ ఈడిగనరసింహులు చెందిన వారు బస్టాండుకు కేటాయించిన స్థలమును ఆక్రమించు కొని 30 నెంబర్ ప్లాట్‌ను ఇల్లు కట్టుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై డోన్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు 546/2021 కోర్టులో వేయడం జరిగిందవి వివాదం కోర్టులో ఉండగానే మళ్లీ ఇప్పుడు గ్రామ అవసరాల కోసం బస్టాండుకు కేటాయించిన స్థలంలో దౌర్జన్యంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ఈ విషయం ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శి ఈఓఆర్‌డి వీఆర్వోకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. బస్టాండ్‌ను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని ప్రజల సౌకర్యం కోసం బస్టాండ్ నిర్మించాలని నాయకులు అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి బి.నారాయణ మండల సహాయ కార్యదర్శి హుస్సేన్ పీరా పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్, మండల కార్యదర్శి బి.నారాయణ మండల సహాయ కార్యదర్శి హుస్సేన్ పీరా పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్ శాఖ కార్యదర్శి పాపారాయుడు రంగన్న రాజు గోరంట్ల పాల్గొన్నారు.

ఘనంగా షేక్ ఫాతిమా జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : విద్యావేత్త, సంఘసంస్కర్త, స్వాతంత్ర సమర యోధురాలు షేక్ ఫాతిమా 194వ జయంతి వేడుకలు గురువారం పట్టణంలోని స్థానిక సిఎస్ఐ స్కూల్ నందు ఏఐటియుసి, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు వి.రఘురామ్మూర్తి మాట్లాడుతూ చీకట్లను చీల్చిన జ్ఞాని కిరణం సంఘసంస్కర్త విద్యావేత్త భారతీయ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు షేక్ ఫాతిమా అన్నారు. రచన కాలంలో విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా ఉండేదన్నారు. కేవలం అగ్రకులాల వారు మాత్రమే విద్యాభ్యాసం చేయడానికి అర్హులుగా ప్రకటించేవారనీ శూద్రులు దళితులు మహిళలు విద్య నేర్చుకోవడం నేరం పాపమని సనాతన మత సంప్రదాయంలో శూద్రులు దళితులు ఇతరులు వేదం విన్న ఉచ్చరించిన కఠిన చర్యలు తీసుకునే వారన్నారు. ఆనాడు వారిని గ్రామం నుండి వెళ్లకుండా షేక్ ఫాతిమా సోదరులకు ఉస్మాన్ సహకారంతో వారికి ఆశ్రయం కల్పించి పాఠశాల స్థాపించి సావిత్రిబాయి పూలేతో కలిసి విద్యా వ్యాప్తిని ప్రోత్సహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజితమ్మ,సిపిఐ నాయకులు ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహానంది దినేష్ విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన లింక్ రోడ్డు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - డోన్ : మండలంలోని బి.రామదుర్గం నుండి లింగనేని దొడ్డి వరకు నూతన లింక్ రోడ్డు ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు డిమాండు చేశారు. బి.రామదుర్గం గ్రామంలో సిపిఐ శాఖ సమావేశం నిర్వహించారు. సమావేశ అధ్యక్షతన సిపిఐ శాఖ కార్యదర్శి సుంకన్న అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడు నెలలుగా కావస్తున్న ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని పింఛను మాత్రమే ఇచ్చి మిగతా హామీలన్నీ అమలు చేయడంలో పూర్తిగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎన్నికల హామీల్లో పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు గ్రామీణ ప్రాంతంలో3 సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయలేదని 2 నుండి 10 తేదీన రాష్ట్రవ్యాప్తంగా తహశీల్దార్, మున్సిపల్, జిల్లా కలెక్టర్ కార్యాలయం కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తున్నమని తెలిపారు. మండలంలోని బి రామదుర్గం నుంచి లింగనేని దొడ్డి వరకు నూతన లింక్ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ రోడ్డు వేయడం వలన డోన్ నుంచి దాదాపుగా 25 కిలోమీటర్ల తగ్గుతాదని, డోన్ నుంచి పత్తికొండకు పోయే ప్రజలకు అనుకూలంగా సౌకర్యంగా ఉంటాదని వారు అన్నారు. దాదాపుగా అన్ని గ్రామ ప్రజలు నూతన రోడ్డు ఏర్పాటు

చేయాలని కోరుకుంటున్నారని ఈ సమస్య పైన ప్రభుత్వం దృష్టికి తీసుక పోతామని వారన్నారు. రామదుర్గం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. పార్టీ సభ్యులను సమావేశం ఏర్పాటు చేసి సిపిఐ 2025 సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నారాయణ, శాఖ కార్యదర్శి పాపారాయుడు, సీనియర్ నాయకులు నెమ్మి లక్ష్మయ్య, ఎల్లప్ప, రామచంద్రుదు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి : సీపీఐ

విశాలాంధ్ర-డోన్ : నేడు డోన్ ఆర్డీవో కార్యాలయం దగ్గర జరిగే మహా ధర్నా జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డోన్ పట్టణంలో స్థానిక నక్కి రామన్న భవనంలో విలేకరుల సమావేశం సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, పట్టణ కార్యదర్శి మోట రాముడు, మండల సహాయ కార్యదర్శులు వరదరాజులు, హుస్సేన్ పీరా, పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపు 10 తేదీన డోన్ ఆర్డీవో కార్యాలయం ముందర మహా ధర్న నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు హాజరువుతున్నట్లు తెలి పారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు డోన్ పట్టణంలోఅన్ని వార్డులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని కానీ, లబ్ధిదారులు కొందరికి ఇండ్లు నిర్మించారని, మరి కొందరికి ఇళ్ల స్థలాలు చూపించలేదని వారు విమర్శించారు. అధికారంలోకి వచ్చేముందు కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిందని, పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. పేద ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం విచారణ చేసి వారందరికీ సంక్రాంతి లోగా పట్టాలు మంజూరు చేయాలన్నారు.

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ సభ్యులుగా రత్నమయ్య

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మానవ హక్కులు, అవినీతి వ్యతిరేక సంస్థ జాతీయ అధ్యక్షులు గుండా రెడ్డి గారి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ సభ్యులుగా ఆళ్లగడ్డకు చెందిన దాలు రత్నమయ్యని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రత్నమయ్య మాట్లాడుతూ ఈ సంస్థ తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో పని చేస్తుందని జాతీయస్థాయిలో కార్యవర్గం ఉందన్నారు. ఈ సంస్థ ద్వారా ప్రజలకు పౌరులకు మానవ హక్కులకు భంగం కలిగిన స్పందించి జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ సంస్థ పని చేస్తుందన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కాగా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ సభ్యులుగా రత్నమయ్యను ఎన్నుకోవడంతో పలువురు రత్నమయ్యను అభినందించారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

విశాలాంధ్ర-అవుకు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని డోన్ ఆర్డీవో నరసింహులు అన్నారు. గురువారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో భూ రీ సర్వే పై గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామ సభకు డోన్ ఆర్డీవో నరసింహులు, డివిజనల్ సర్వేయర్ చంద్రశేఖర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో నరసింహులు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి గ్రామాల వారీగా భూ రీసర్వే ప్రారంభమవుతుందని అన్నారు. గ్రామాలలో భూ రీసర్వే జరిగే తేదీలను రెవెన్యూ అధికారులు ప్రకటిస్తారని అన్నారు. ఆ తేదీలలో రైతులు అందుబాటులో ఉండి పట్టాదారు పాసుపుస్తకాలు అధికారులకు అందించి పొలము హద్దులు చూపించి రీ సర్వేకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహసిల్దార్ నారాయణరెడ్డి, ఆర్ఐ వెంగల్రెడ్డి, సర్వేయర్ హరికృష్ణ, వీఆర్వో చంద్రహాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల్లో వయసుకు తగ్గ బరువు, ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ తల్లుల్లో కూడ మంచి అవగాహన తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అంగన్వాడి కార్యకర్తలను ఆదేశించారు. నంద్యాల మండలంలోని కొత్తపల్లి సాక్షం అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. సాక్ష్యం అంగన్వాడి కేంద్రానికి కేటాయించిన ప్రీస్కూల్ మెటీరియల్ లోని 12 రకాల వస్తువులను, అంగన్వాడి కేంద్రంలోని పిల్లల ఎత్తులు, బరువులను చూసి సంబంధిత వివరాలు పొందుపరిచిన లోప పోషణ, గ్రోత్ రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. తల్లులకు ఇచ్చే టేక్ హెూమ్ రేషన్ లో అందించే న్యూట్రిషన్ కిట్స్, డ్రింకింగ్ వాటర్, ఆర్ఓ ప్లాంట్, పోషణ వాటికలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రీస్కూల్ పిల్లల లో అన్ని రకాల అభివృద్ధిలను పెంపొందించడానికి కృషి చేస్తున్న అంగన్వాడీ కార్యకర్త ఈశ్వరమ్మ టీం సభ్యుల పనితీరును కలెక్టర్ అభినందించారు. ఇంకా అంగన్వాడి కేంద్రానికి కావలసిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకుంటూ అవసరమైన సౌకర్యాలను వెంటనే సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతిని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ దశలో వున్న రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పూర్తికానందున సంబంధిత వివరాలను తెలుసుకుంటూ సచివాలయ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

స్కాలర్స్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు: పట్టణంలోని స్థానిక స్కాలర్స్ స్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పండగ వాతావరణాన్ని ఏర్పరిచి రంగురంగుల రంగవల్లికలు మరియు హరిదాసుల పాటలు, భోగి మంటలు, భోగి పళ్ళతో సంక్రాత్రి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కాలూరి లక్ష్మి శివప్రసాద్ పండగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ నందు వైభవంగా స్పోర్ట్స్ డే వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ నందు స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏఎస్పి ఎన్.యుగంధర్ బాబు, రాయలసీమ యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ శివ కిషోర్, పాఠశాల చైర్మన్ జే. లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. యుగంధర్ బాబు మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో పిల్లల్ని రాణించాలని, పిల్లలను మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ఉంటుందన్నారు. డాక్టర్ శివ కిషోర్ మాట్లాడుతూ పిల్లలలో క్రమశిక్షణ, ఏకాగ్రతను పెంపొందించుకోవడంలో ఆటలు ఎంతగానో ముఖ్యమన్నారు. పాఠశాల డైరెక్టర్ కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు, ఆటలు, సాంస్కృతి కార్యక్రమాలు, పోటీ పరీక్షల్లో అన్ని రంగాల్లో పిల్లల్ని ముందుకు తీసుకువెళ్లడమే ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ ముఖ్య ఉద్దేశమన్నారు. సంక్రాంతి పండుగ విశిష్టతను ఎంతో గొప్పగా పిల్లలు తమ నృత్యాలతో,

వేషధారణలతో తెలిపారు. ఆటల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రమాణ పత్రాలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జువ్వాజీ సుంకన్న గౌడు జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు: కలియుగ దాన కర్ణుడు కీర్తి శేషులు జువ్వాజి సుంకన్న గౌడ్ 137వ జయంతి వేడుకలు నందికొట్కూరు పురపాలక సంఘం, జవ్వాజి సుంకన్న గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, వీర కుమార్ గౌడ్, హాజరయ్యారు. మొదట మున్సిపాలిటీ ఆవరణలోని జువ్వాజి సుంకన్న గౌడ్ విగ్రహానికి మున్సిపల్ రెవిన్యూ అధికారి మధుబాబు పూలమాలలు వేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జువ్వాజీ సుంకన్న గౌడ్ నందికొట్కూరులో మున్సిపాలిటీకి, కాలేజీలకు, ఉచితంగా కొన్ని కోట్లు విలువచేసే స్థలాలు ఇచ్చి కలియుగ దానకర్ణునిగా పేరు తెచ్చుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఆయన స్ఫూర్తితో మనమందరం నడవాలన్నారు. ఇప్పటికీ ఆయన పేరు మీద ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుండడంతో వారికి అభినందనలు తెలిపారు. కరోనా విపత్తులో సేవాసమితి కమిటీ సభ్యులు శ్రీకాంత్ గౌడ్, వీర కుమార్ గౌడ్, దేశెట్టి శ్రీనివాసులు, బజాజ్, రంగస్వామి, జయన్న చేసిన సేవలు వెలకట్టలేనిటి వన్నారు. వారిని శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. కరోనా విపత్తు సమయంలో 65 రోజులు భోజన వసతి ఏర్పాటు చేసి సేవలందించిన సభ్యులందరికీ జవ్వాజీ సుంకన్న గౌడ్ సేవా సమితి తరపున సాయిరాం కాలేజ్ కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, శ్రీరామ థియేటర్ అధినేత రామిరెడ్డికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం అనంతరం పట్టణ నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వీర కుమార్ గౌడ్, శేఖర్ గౌడ్, కరుణాకర గౌడ్, కిషోర్ గౌడ్, రాజా గౌడ్, ఏఈ దినేష్ కుమార్, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, సీఈఓ శాంత కుమార్, గౌడ సంఘం నాయకులు నాగార్జున గౌడ్, చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం దగ్గర జరిగే నిరసన ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : అర్హులైన లబ్ధిదారులకు పేదలకు ఇళ్ల స్థలాలు 3సెంట్లు కేటాయించాలని జనవరి 10వ తేదీన జరిగే రాష్ట్ర వ్యాప్త నిరసన ధర్నాలో భాగంగా ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం దగ్గర సీపీఐ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని అర్జీ దారులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు, తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్ పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు సిపిఐ కార్యాలయంలో మహిళా సమైక్య నాయకురాలు స్వాతితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జూపాడుబంగ్లా పాములపాడు, కొత్తపల్లి మండలంలో అనేకమంది ఇల్లులేని నిరుపేదలు ఎన్నో సంవత్సరాల నుండి ఇల్లు అద్దెలకి తీసుకొని నివసిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయన్నారు. బాణాకచర్ల, గుండాలనట్టు, భానుముక్కాల, చాఖోలు, బన్నూరు, సిద్దేశ్వరం గ్రామాల్లో వందలాదిమంది లబ్ధిదారులు అర్జీలు సమర్పించాలని గృహాలు మాజూరు కాకమునుపే వీళ్ళకి స్థలాలు కేటాయించాలని వారి కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షునిగా లాయర్ మహేశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల: మండలంలోని మీర్జాపురం గ్రామ సర్పంచ్, లాయర్ బుషాకు మహేశ్వర్ రెడ్డిని నంద్యాల వైసీపీ జిల్లా ఉపాధ్యక్షునిగా అధిష్టానం నియమించింది. జిల్లా ఉపాధ్యక్ష పదవి రావడానికి కృషి చేసిన బనగానపల్లి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని గురువారం స్వగృహంలో మహేశ్వర్ రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మహేశ్వర్ రెడ్డి వైసీపీ ఆవిర్భావం నుండి 3 సంవత్సరాలు కొలిమిగుండ్ల మండల కన్వీనర్‌గా పనిచేసి పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. 2021 సం నుండి మీర్జాపురం గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తూ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. అధిష్టానం తన మీద నమ్మకంతో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షునిగా నియమించిందని, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిల సహకారంతో పార్టీ మరింత బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో ఆల్ డిక్షన్ టెక్నాలజీస్ ఇండియన్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన జాబ్ మేళా కు గురువారం విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కంపెనీ రిక్రూట్‌మెంట్ అధికారి సాయి సునీల్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు 110 మంది యువతి,యువకులు హాజరయ్యారని అందులోని 90 మంది ఉద్యోగాలకు ఎంపిక చేసామన్నారు. వారికి నియామక పత్రాలను అందజేశామన్నారు. డిగ్రీ కళాశాల కరెస్పాండంట్ రఘురామ్, ఇంటర్ కరస్పాండెంట్ ఆర్‌ఎస్ రమణ గుప్త, కార్యదర్శి పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ షాబుద్దీన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మహేశ్వరయ్య, కంపెనీ సూపర్వైజర్ నితిన్‌లు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

విశాలాంధ్ర - రుద్రవరం: మండల కేంద్రానికి వెలసిన వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయములో నేడు వైకుంఠ ఏకాదశి వేడుకలను కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించేందుకు అన్ని వసతులను ఏర్పాటు చేశారు. గురువారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆలయ పరిసరాలను ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశికి హాజరయ్యే భక్తులలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని దేవాలయ కమిటీ సభ్యులకు సూచించారు. దేవస్థానానికి దూరంలో వాహనాలకు ప్రత్యేకపార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే భక్తులకు ప్రత్యేక క్యూ లైన్ లో ఏర్పాటు చేయాలన్నారు. పలహారం, భోజన సమయంలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట సిఐ వంశీధర్, ఏఎస్ఐ భూపాల్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ సింగతల మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, ప్రధాన అర్చకులు వారనాసి గోపి శర్మ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించిన శిల్పాకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : వైసీపీ జిల్లా ఉపాధ్యక్షునిగా ఎన్నిక చేసినందుకు కృషి చేసిన, సముచిత స్థానం కల్పించిన మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, నాగిని రవి సింగారెడ్డికు ప్రత్యేకంగా డా.దాల్మిల్ అమీర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లా డుతూ నంద్యాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ముందస్తుగా కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 10, జనవరి 2025

స్టీఫెన్ హాకింగ్ నేటి, భవిష్యత్ తరాల శాస్త్రవేత్తలకు స్ఫూర్తి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: స్టీఫెన్ హాకింగ్ నేటి, భవిష్యత్ తరాల శాస్త్రవేత్తలకు స్ఫూర్తి అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి .ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్టీఫెన్ హాకింగ్ జయంతిని ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరిగింది. ముందుగా స్టీఫెన్ హాకింగ్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ స్టీఫెన్ హాకింగ్ జీవితము నేటి, భవిష్యత్ తరాలకు ఆదర్శమని ఆయన అరుదైన నరాల సంబంధమైన వ్యాధితో బాధపడుతూ, చివరకు శరీరం అచేతనమైన, పని చేయలేని పరిస్థితిలో ఉన్న పనిచేసే ఒకే చురుకైన మెదడుతో చక్రాల కుర్చీకే తన జీవితం అత్యధిక భాగం గడిపిన విశ్వంలోని అతి సంక్లిష్టమైన బ్లాక్ హెూల్స్ పరిశోధన చేసి బ్లాక్ హెూల్స్ రేడియేషన్ వెలువరించారని తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శంకరయ్య మాట్లాడుతూ మన సమాజంలో ఇప్పటికీ మూఢ నమ్మకాలు మూలుగుతున్నాయని, వాటిని నేటి విద్యార్థులైన రేపటి పౌరులు శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకొని, భవిష్యత్ తరాలు శాస్త్రీయ పౌరులుగా రూపొందేటట్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు బిజి మాదన్న మాట్లాడుతూ మానవ సమస్యలు అన్నిటినీ విద్య అందులో ముఖ్యంగా శాస్త్రీయ విద్య పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాన్యాసాకులు రమేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలి : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-కల్లూరు: అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి వాటి నిర్మాణంకు రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లాకార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నగర సహాయకార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి గిడ్డయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి నెలలుగడుస్తున్నా ఎన్నికలలో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. అనేక మంది నిరుపేదలు ఉపాధి కోసం పట్టణాలకు వలసలు వచ్చి చాలీచాలని కూలీలతో తమ జీవితాలను నెట్టుకొస్తూ కనీసం అద్దెలుకూడా చెల్లించలేని దుర్భరజీవితాలు అనుభవిస్తున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పేదలకు మొండిచెయ్యి చూపి తీవ్ర అన్యాయం చేశారని, ఈకూటమి ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చిన తరువాత పేదవాడి సొంతింటి కళ నెరవేరుతుందని కొండత ఆశతో ఉన్న నిరుపేదలకు ఆశా నిరాశ అయిందన్నారు. ఏండ్ల తరబడి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న ప్రజలకు పట్టాలు పంపిణీ చేయడంలో పాలకులు విఫలం చెందారని మండిపడ్డారు. అనేక మందికి అర్హత ఉన్నప్పటికి సచివాలయాల్లో అన్‌లైన్ చేయించుకుని తమకు పట్టాలు ఇవ్వాలని పలుమార్లు అధికారుల చుట్టు ప్రజలు తిరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారి ఆగ్రహం వ్యక్తం చేశారు.కల్లూరు అర్బన్‌లో వందలాది మంది అద్దె గృహాల్లో జీవనం సాగిస్తున్నారని వాటితోపాటు గ్రామీణ ప్రాంతంలో అనేకగ్రామాల్లో కనీసం జీవించేందుకు గుడిసె సైతంలేక కుటుంబ సమేతంగా అవస్తలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేసి దరఖాస్తుచేసుకున్న ప్రతి పేదవానికి పట్టణాల్లో రెండుసెంట్లు, గ్రామాల్లో మూడుసెంట్ల స్థలం మంజూరుచేసి పట్టాలు పంపిణీ చేయాలన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతా - తహశీల్దార్ ఆంజనేయులు: ఈ సందర్భంగా తహశీల్దార్ రామాంజనేయులు మాట్లాడుతూ అర్హత ఉన్నప్రతి ఒక్కరికి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి ఇంఢ్లపట్టాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, నగర సహాయకార్యదర్శి మహేష్ , నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, సోమన్న, నల్లన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఎఐఎస్ఎఫ్ నాయకులు శరత్, ధనలక్ష్మీ, రాము తదితరులు ఉన్నారు.

హెూం శాఖ మంత్రి రాజీనామా చేయాలి

విశాలాంధ్ర- ఆలూరు: ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు గురువారం అంబేద్కర్ సర్కిల్ నందు ధర్నా చేస్తూ అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్చార్జి చిప్పగిరి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ రూపశిల్పి సంఘసంస్కర్త అన్ని వర్గాల ఆర్థిక సామాజిక సాధికారత కోసం జీవితాంతం పరితపించిన, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెంటులో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు న్నామని, అంబేద్కర్ అవమానించే విధంగా చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోని, క్షమాపణ చెబుతూ, కేంద్ర హెూం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆలూరు మండల అధ్యక్షులు మొలగవెళ్లి రామాంజనేయులు, సీనియర్ నాయకులు తుంబలబీడు లక్ష్మన్న, చిప్పగిరి మండల అధ్యక్షులు మంజునాథ్, కరెంటు గోవిందు, మీసాల గోవిందప్ప, వరకుమార్, తిమ్మప్ప, నవీన్, వెంకటేష్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్ఎఫ్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూల్ నగరంలో ఎస్‌వీ హై స్కూల్ యుపీఎస్ఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ వేల్పుల ఆధ్వర్యంలో 2025 యూపీఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో రాష్ట్ర నాయకులు టీఎస్ సతీష్ కుమార్ జిల్లా అధ్యక్షుడు ఎం.రాఘవేంద్ర రాజ్, జిల్లా కార్యదర్శి రంగనాథ్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్, నగర అధ్యక్షులు నాగన్న, మాజీ అధ్యక్షులు ఎన్.క్రిష్టఫర్, రెండు జిల్లాల ఇన్చార్జి కుమార్‌లు క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూపీఎస్ఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు యూపీఎస్ఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ప్రతి ఒక్కరూ భాగస్వామ్ కావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - కర్నూలు : పేదలు అక్రమించుకుని గుడిసెలు వేసుకున్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం బి.తాండ్రపాడు రైతు సదస్సులో స్పెషల్ కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా రామకృష్ణా రెడ్డి గత సంవత్సరం క్రితం పేదలకు వేయించిన గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ సదస్సులో వివరిం చడం జరిగింది. పేదలు వేసుకున్న గుడిసెలలో మౌలిక వసతులైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రము, అంగన్వాడి కేంద్రము, స్కూలు, రోడ్లు, మురికి కాలువలు, కరెంటు సమస్యలను పరిష్కరించాలని స్పెషల్ కలెక్టర్‌ను కోరడం జరిగింది. రెవిన్యూ సదస్సులో పాల్గొన్న కర్నూల్ రూరల్ ఇంచార్జ్ ఎమ్మార్వో శివకుమార్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి సి మహేష్, సీపీఐ నగర నాయకులు పుల్లయ్య, రాముడు, బాష, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర-పత్తికొండ: ఇల్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మద్దిగేరి, కుమ్మర వీధి, కటిక వీధి, ఎస్సీ కాలనీలలో ఇల్లులేని నిరుపేదలను కలుసుకొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలతో కలిసి సిపిఐ ఆధ్వర్యంలో నేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, నాయకులు సిద్ధ లింగప్ప, ఉపేంద్ర, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా విద్యా రంగానికి చేసిన సేవలు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే, మహాత్మా జ్యోతిరావు పూలే లతో కలిసి పాఠశాలలను నిర్వహించిన ఫాతిమా షేక్ విద్యా రంగానికి చేసిన సేవలు మరవలేమని ప్రధానోపాధ్యాయులు కే.శోభ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫాతిమా షేక్ 194వ జయంతిను ఘనంగా నిర్వహించారు. బాల్యవివాహాలు, సతీ సహగమనం వంటి మూఢ నమ్మకాలను ఎదిరించారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు. 1851 సంవత్సరంలో సావిత్రీబాయి పూలే, మహాత్మా జ్యోతిరావు పూలేలతో కలిసి పాఠశాలలను నడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి క్రాంతి నాయుడు, మండల అధ్యక్షులు ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పాలనలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగానికి రక్షణ కరువైందన్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పార్లమెం టులో అంబేద్కర్‌ను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామన్నారు. కాంగ్రెస్ నాయకులు శ్రీహర్ష, రవి పాల్గొన్నారు.

స్నాతకోత్సవ అప్లికేషన్ గడువు పొడిగింపు

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: క్లస్టర్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం అప్లికేషన్ గడువు విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నెల 18 వరకు పొడిగించినట్లు క్లస్టర్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డివిఆర్ సాయి గోపాల్ తెలిపారు. వివిధ విశ్వవిద్యాలయాల నుండి లోయర్ డిగ్రీలు అందుబాటులో లేనందున గడువులోపు అప్లై చేసుకో లేక పోయారని వారి అభ్యర్థన మేరకే పది రోజులు గడువు పెంచామని తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలో రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రమాదేవి తెలిపారు. ఈ రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకో వాలని తహశీల్దార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పగిడి రాయి గ్రామంలో రీసర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాల నుండి రైతుల భూ సమస్యలు ఉన్నాయని, ఆ సమ స్యలను పరిష్కరించేందుకు రీసర్వే కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు

విశాలాంధ్ర - కల్లూరు : సీపీఐ శత జయంతి వార్షికోత్సవాలు కల్లూరు ఏరియా రాజీవ్ గృహ కల్పశాఖలో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా శాఖ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ జెండావిష్కరణ కార్యక్రమాలు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు లలితమ్మ జెండా ఆవిష్కరించారు ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తిచేసుకుని శతజయంతి ఉత్సవాలు నిర్వహించుకుంటుందన్నారు. అనేక నిర్భందాలు, అనేక కుట్రకేసులు ఎదుర్కొని భారతదేశంకి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలుపు నిచ్చినటువంటి ఏకైక పార్టీ బారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. దేశవ్యాప్తంగా కష్టజీవులు, శ్రమజీవులు తరపున నిలబడిన పార్టీ సీపీఐ అని తెలిపారు. రాజీవ్ గృహకల్ప మొత్తం 26 బ్లాగులు కూడా పెచ్చులు ఊడి శిథిలావస్థకు చేరుకున్నదని రాజీవ్ గృహకల్ప గృహాలకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని, మురికి కాలువలను ఏర్పాటు చేయాలని, మంచినీటి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు సోమన్న,రబియా, గురు ప్రసాద్ ,షరీఫ్ నగర్ శాఖ నుండి మాధవి, రాములమ్మ భీముడు, వలి, అల్లాబి, దప్పు మాణిక్యం, మల్లి, రాయుడు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఆందోళనలు నిర్వహిస్తాం : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - కోడుమూరు : సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు ఇచ్చిన సెలవుల్లో కూడా కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు క్లాసులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయని, సంక్రాంతి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకునేలా ఆందోళనలు చేస్తామని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శిలు వీరేంద్ర, ఎస్.అల్తాఫ్ బాషాలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య కోడుమూరు మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సంక్రాంతి సెలవులలో ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో క్లాస్ నిర్వహిస్తే అలాంటి విద్యాసంస్థలను సీజ్ చేసి, వాటి గుర్తింపు రద్దు చేయలని విద్యార్థులకు అండగా వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సెలవులలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామన్నారు. ప్రస్తుతమున్న పోటీ చదువులలో విద్యార్థులు చాలా మానసిక ఒత్తిడికి లోనవుతారని, విద్యార్థులకు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేందుకు సంక్రాంతి పండుగ సెలవులు ఉపయోగ పడతాయన్నారు. కానీ ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నియమ, నిబంధనలను తుంగలోతొక్కి సెలవుల్లో తరగతులు నిర్వహించి, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తే, అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత విద్యాశాఖ అధికారులపై ఎంతైనా ఉందన్నారు. కేవలం పేపర్ల ప్రకటనలకు పరిమితం కాకుండా అధికారులు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. మండల ఉపాధ్యక్షులు మునిస్వామి రాజీవ్, రంజిత్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించండి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: ఉపాధి హామీ పనుల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పని పనులు కల్పించాలని జిల్లా డ్వామా పిడి వెంకటరమణయ్య అన్నారు. గురువారం ఆయన ఆకస్మికంగా ఉపాధి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సుదూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా నివారణ చేపట్టి ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించాలని ఆయన తెలిపారు. ఉపాధి పనుల్లో కూలీలకు వేతనాలు పెండింగ్ లేకుండా అందిస్తామని ఆయన అన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ పనులు దగ్గరికి వెళ్లి పనికొలతలను సక్రమంగా తీసి కూలీలకు న్యాయం చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మాస్టర్లను పని దగ్గరికి తీసుకెళ్లి హాజరు వేయాలన్నారు. వారంలో వచ్చిన మాస్టర్లను వెంటనే పెండింగ్ లేకుండా ఆన్లైన్‌లో అప్లోడ్ చేసి పంపాలని కంప్యూటర్ ఆపరేటర్లకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ కుమార్, ఏపీవో నాగసులోచన టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ముద్దాయికి మూడేళ్లు జైలు శిక్ష

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: నగరంలో పదేళ్ల ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, అసభ్యకర ఫోటోలు చూపిస్తూ, మాట్లాడటంతో పాటు లైంగికంగా బలవంతం చేసిన ముద్దాయికి ఫోక్సో కోర్టు మూడు సంవత్సరాలు జైలు, 20వేలు జరిమాన విధిస్తూ గురువారం తీర్పు వెలువడించింది. సదరు బాలిక తల్లి యశోధ ఫిర్యాదు మేరకు 2021 జూన్ 23వ తేదీన కర్నూలు మూడవ పట్టణ పోలీసు స్టేషన్ లో క్రైమ్ నెంబర్ 372 / 2021 - 12 పోక్సో యాక్ట్ నమోదు చేశారు. అప్పటి కర్నూలు మూడవ పట్టణ ఎస్సై రెహమతుల్లా, మహిళా పియస్ ఎస్సై కొండయ్యలు దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన కర్నూలు జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి భూపాల్ రెడ్డి నిందితుడు బొగ్గుల రాజేష్ కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. స్పెషల్ పిపిలు వెంకటేశ్వరెడ్డి, ప్రతాప్ రెడ్డి, దర్యాప్తు అధికారులు కర్నూలు త్రీ టౌన్‌కు చెందిన ఎస్సై రెహమతుల్లా, మహిళా పియస్ ఎస్సై కొండయ్య, కర్నూలు త్రీ టౌన్ కోర్టు కానిస్టేబుల్స్ జాన్సన్ ఇమ్మానుయేల్, కిశోర్‌లను కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అభినందించారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో 10న సంక్రాంతి ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - కర్నూలు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక సలాం ఖాన్ ఎస్టియు భవనం ఆవరణలో జనవరి 10 వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించబడునని ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి జిల్లా ప్రధాన కార్యదర్శి టికె జనార్దన్ లు ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు విద్యార్థులకు మొదటి, రెండో, మూడో బహుమతులు అందజేశారు. పట్టణంలో ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

సర్వేపల్లిలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక కృష్ణానగర్ సర్వే పల్లి పాఠశాల యందు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. పుష్య మాసంలో ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడు మకర రాశిలో ప్రవేశించే సందర్భంలో ఉత్తరాయణ పుణ్య కాలం ప్రారంభమయ్యే నవక్రాంతి సంక్రాంతి సందర్భంగా ముందస్తుగా సర్వేపల్లి పాఠశాలలో ఈ సంక్రాంతి సంబరాలను ముఖ్య అతిథి పి.శేషన్న భోగిమంటలు శ్రీమహాలక్ష్మి పూజాకార్యక్రమంతో ప్రారంభించారు. కెపి అరుణ పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు పాలను పొంగించి భోగభాగ్యాలిచ్చే భాగ్య లక్ష్మికి ఆహ్వానం పలికి, హరిదాసుకు ధాన్యాన్ని సమర్పించి కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రీప్రైమరీ విద్యార్థులకు భోగిపళ్ళు, విద్యార్థుల తల్లులకు ముత్యాల ముగ్గులు పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఆటపాటలలో, గొబ్బిళ్ళ పాటలతో అలరించారు. ముత్యాల ముగ్గులు పోటీలలో గెలుపొందినవారికి, పాల్గొన్న వారికి ముఖ్య అతిథి పి.శేషన్న బహుమతి ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పి.శేషన్న మాట్లాడుతూ విద్యార్థులలో సంప్రదాయాలు, సంస్కృతి పెంపొందించేలా మరియు శాస్త్రీయంగా ఈ సంప్రదాయాలు, పద్ధతులూ ఏ విధంగా మానవాళికి వినియోగ పడతాయో తెలియ చేస్తూ అందరి జీవితాలలో ఆ భాగ్యలక్ష్మి నవక్రాంతులను తీసుకువచ్చి భోగ భాగ్యాలను ఇవ్వాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర - సి.బెళగల్: విత్తన దుకాణా యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విశ్వజిత్ ట్రేడర్స్‌లో వ్యవసాయ అధికారి తనిఖీ నిర్వహించి షాపులోని పలు రిజిస్టర్లను, స్టాకును పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వజిత ట్రేడర్స్ షాపులో తీసిన విత్తన నమూనాలను పరీక్షల నిమిత్తం తిరుపతి ల్యాబ్‌నకు పంపించినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. షాపుల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే రైతులకు విత్తనాలను విక్రయించాలని అలాకాకుండా ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి షాపులపై కఠిన చర్యలు తీసుకొని, వారి లైసెన్స్‌లను రద్దు చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్సీ కాల్వపై సిమెంట్ బ్రిడ్జి నిర్మించాలి

విశాలాంధ్ర - హెూళగుంద: హెూళగుంద సమీపంలో ప్రవహించే ఎల్ఎల్సి దిగువ కాలువపై సిమెంట్ బ్రిడ్జి నిర్మించాలని మండల బిజెపి కన్వీనర్ ప్రసాద్, గ్రామ ప్రజలు మల్లప్ప, ఉమేష్, శేఖర్, లైబ్రరీ నాగరాజ, సుదర్శన్ శెట్టి, సిపి మహేష్, రఘు, ఆఫీస్, కుబేర, సాయిబేష్, గురువారం ఎల్ఎల్సి ఏఈకి వినతి పత్రాన్ని సమర్పించారు. మండల బిజెపి కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ కాల్వపై ఇనుప బ్రిడ్జి ఏర్పాటు చేశారని ఇనుప బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు, ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. హెూళగుంద నుండి ముద్దట మాగి, అగ్రహారం ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లాలంటే శిథిలావస్థలో ఉన్న ఇనుప బ్రిడ్జి దాటి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని వాపోయారు. తుంగభద్ర బోర్డు అధికారులు శ్రద్ధ వహించి శిథిలావస్థలో ఉన్న ఇనుప బ్రిడ్జను తొలగించి, కొత్తగా సిమెంట్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రజల రాకపోకలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని అన్నారు.

కళాశాల విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పట్టణ పదవ వార్డు కౌన్సిలర్ రేమట సురేష్ ఉచితంగా భోజన ప్లేట్లను పంపిణీ చేశారు. గురువారం ప్రభుత్వ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్లేట్ల పంపిణీ కార్యక్రమంలో ఎస్సై పి.తిమ్మయ్య, నగర పంచాయతీ మాజీ చైర్మన్ కె.రామాంజనేయులు, యువ నాయకులు రేమట వెంకటేశ్వర్లు, సృజన్, కళాశాల ప్రిన్సిపాల్ రమణ భోజన ప్లేట్లను సురేష్ పంపిణీ చేసి విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం వడ్డించారు. గూడూరు పట్టణ వాల్మీకి అధ్యక్షుడు, కో-ఆప్షన్ సభ్యులు పుట్టపాశం రామాంజ నేయులు, మత్స శాఖ జిల్లా కమిటీ అధ్యక్షులు తెలుగు శ్రీనివాసులు, ఎల్ఎల్సిడిసి చైర్మన్ సింగన గేరి నాయుడు, పట్టణ వాల్మీకి కోశాధికారి కురుకుంద విజయ్ కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ కన్నయ్య, టీడీపీ నేతలు పవన్, బాబు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - తుగ్గలి: అర్హులైన లబ్ధిదారులకు పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు స్థలం కేటాయించి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని, గత నెలలో ప్రతి సచివాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించిన సంగతి అందరికీ తెలిసినదే. ఇంతవరకైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పెడచెవిన పెట్టడం పట్ల ఆగ్రహించిన సిపిఐ నాయకులు శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టనుంది. ఈ ధర్నాలో అర్హులైన ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని తుగ్గలి మండల సిపిఐ కార్యదర్శి సుల్తాన్ పిలుపునిచ్చారు.

బాల్య వివాహాల వల్ల అనర్థాలు ఎన్నో

విశాలాంధ్ర - హెూళగుంద: మండలంలోని కిషోర్ బాలికలకు బాల్య వివాహాలు జరిపిస్తే ఎన్నో అనర్థాలు జరుగుతాయని ఎంఈఓ-2 జగన్నాథం అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కిషోర్ బాలికలకు బాల్యవివాహాల నిరోధం, చట్టం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ-2 జగన్నాథం మాట్లాడుతూ చిన్న పిల్లలకు బాల్య వివాహాలు నేర్పిస్తే రక్తం బలహీనత వల్ల అనారోగ్య పాలవుతారని అన్నారు. బాల్యవివాహాల నిరోధానికి అంగన్వాడి కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అధికారులు కృషి చేయాలని కోరారు. ఈఓఆర్డి చక్రవర్తి, అంగన్వాడి సూపర్వైజర్ షీభా రాణి, ఏపీఎం హనుమంతు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శక్తి సదన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణంను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్‌లను పరిశీలించి రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించి, దిశ ఒన్ స్టాఫ్ సెంటరు ప్రాంగణ ఆవరణలో కాలువ నీటి అపరిశుభ్రత కారణంగా సంబందిత అధికారికి శుభ్రపరుచుకోవలసినదిగా ఆదేశాలను జారీచేశారు.

ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర- కర్నూలు : ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. కర్నూలు జిల్లా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర కౌన్సిల్ సమావేశం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షులు రాము అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న తేదీల్లో కర్నూలు ఎస్‌టీయు భవన్లో జరుగు ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ 9వ నగర్ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగంలో ఉన్న లక్షలాది ఆటో కార్మికుల భద్రత కల్పించడంలో విఫలం చెందారని వారు విమర్శించారు. నూతన రోడ్డు రవాణా చట్టం తీసుకొచ్చి కార్మికులను జైలుకు పంపే పరిస్థితి తెచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల బారినపడి చనిపోయిన, దివ్యాంగులు అయిన ఆటో కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించడానికి ఆటో రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు వలన కార్మికులకు భారం కాకుండా డీజిల్, పెట్రోల్,గ్యాస్ ధరలను జీఎస్టి పరిధిలోకి తీసుకురావాలన్నారు. పెరిగిన డీజిల్, పెట్రోల్ గ్యాస్ ధరలు తగ్గించాలని, కార్మికుల అనేక పోరాటాలు చేసినప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. తక్షణమే ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల వ్యతిరేక విధానాలను ఈనెల23 తేదీన ఎస్టియు. భవన్ లో జరుగు ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర 9వ మహాసభల్లో చర్చించి, భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకటేష్, జి.చంద్రశేఖర్, ఆటో వర్కర్స్ యూని యన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ఆటో వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఆర్.కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి నాగరాజ్, స్వాములు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 10, జనవరి 2025

సంస్కృతి చాటేందుకే సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - కోడుమూరు: భారతదేశ సంస్కృతిని చాటి చెప్పేందుకే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఎంతో వేడుకగా సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని నాగార్జున విద్యా నిలయం డైరెక్టర్ నాగార్జున యాదవ్ అన్నారు. గురువారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక కోడుమూరులోని నాగార్జున విద్య నిలయంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా నాగార్జున విద్యా నిలయం డైరెక్టర్ నాగార్జున యాదవ్, మండల ఎంఈఓ వసంతలక్ష్మి, సినీనిర్మాత జగదీష్ తదితరులు హాజరయ్యారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్న ముగ్గుల పోటీలలో పాఠశాల ఉపాధ్యాయ విభాగంలో మొదటి బహుమతి బి.సునీత, శకుంతల బృందం, రెండవ బహుమతి పద్మలత, మద్దమ్మ బృందం కైవసం చేసుకున్నారు.సీనియర్ విద్యార్థుల్లో రమ్యలహరి బృందం మొదటి బహుమతి, రెండవ బహుమతి నందిని బృందం, లావణ్య బృందం ప్రత్యేక బహుమతిని కైవశం చేసుకున్నారు. జూనియర్స్ విభాగంలో తన్విత బృందం మొదటి బహుమతి, అక్షిత బృందం రెండవ బహుమతులను సాధించారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు ఎంఈఓ వసంతలక్ష్మి భాయ్ చేతుల మీదుగా షీల్డ్‌ల తోపాటు ప్రత్యేక బహుమతులు అందజేశారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జి.సురేంద్రరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినీ-ఉపాధ్యాయులు, విద్యార్థిని-విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి వేడుకలకు కొండపేట వెంకటేశ్వర స్వామి ఆలయం సిద్ధం

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణంలోని కొండపేట కొట్నాల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఈనెల 10న జరగనున్న ముక్కోటి ఏకాదశి వేడుకలకు సర్వసన్నద్ధమైంది. వివరాల్లోకి వెళితే... గత ఏడాది ఈ పురాతన ఆలయాన్ని పునర్నిర్మించేందుకై కూల గొట్టడం జరిగింది. అయితే నూతన ఆలయ నిర్మాణం జాప్యం కానుండంతో ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించటం అసాధ్యంగా మారింది. అయితే విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మలు ఈ నెల 4వ తేదీన ఆలయ ప్రాంతానికి వెళ్లి తాము స్వయంగా పరిస్థితి గమనించారు. అనంతరం ఆలయ కమిటీతో, స్థానికులతో చర్చించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఎడాది వైకుంఠ ఏకాదశి పండుగ వేడుకలను నిరాటంకంగా జరపాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆలయ ప్రాంగణం ముళ్ళకంపలతో రాళ్లతో అస్తవ్యస్తంగా ఉండడంతో యుద్ధ ప్రాతిపదికన ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నారు. ముక్కోటి ఏకాదశి వేడుకలకు సంబంధించి ప్రధానంగా స్వామివారిని కొలువుంచేందుకు అవసరమైన గర్భాలయం, ముఖ మండపంతో కూడిన భారీ సెట్టింగ్ ను ఏర్పాటు చేశారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు ముక్కోటి ఏకాదశి వేడుకలను జరపడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని కేవలం 4 రోజుల వ్యవధిలో ఆగ మేఘాల మీద నమూనా ఆలయ నిర్మాణాన్ని చేపట్టడంతో 10 తేదీ వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకునేందుకు వీలు కలిగింది. ఇదే సమయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నమూనా ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకునే ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్ష వ్యక్తం చేస్తున్నారు. గురువారం నాడు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆలయం ప్రాంతంలో ఆలయ పరిసరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వాణిజ్య విభాగ చైర్మన్ టంగుటూరి సీనయ్య, పిపి మురళీమోహన్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, టిఎస్ఆర్ రెడ్డి, ఎస్ఎస్ఎం ఆర్యవైశ్యులు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నా చేరువుపల్లె - నా ఆరోగ్యం

విశాలాంధ్ర - బనగానపల్లె: బనగానపల్లె మండలంలోని చెరువు పల్లె గ్రామంలో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్లాస్టిక్ నిర్మూలిద్దాం అనే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇందులో భాగంగా బీసీ ఇందిరారెడ్డి అనుసరించి అలాగే బిసి ఇందిరా రెడ్డి పిలుపు మేరకు గ్రామ నాయకుడు శరత్ బాబు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలన మెగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. చెరువుపల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, శ్రీ సాయి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామంలోని నాయకులు, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. శరత్ బాబు గ్రామంలో ప్లాస్టిక్ వాడకం పట్ల కలిగే దుష్ఫలితాలు గ్రామ ప్రజలకుఅవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమీనాభి, గ్రామ పంచాయతీ అధికారులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తిరుమలలో జరిగిన ఘటపై బాధాకరం

విశాలాంధ్ర - దేవనకొండ: తిరుమల శ్రీవారిని వైకుంఠ ఏకాదశి రోజు దర్శించుకోవాలని టోకెన్లు తీసుకునేలోపే ఈ ఘటనలో మరణాలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. వారి కుటుం బాలకు ప్రగాఢ సాను భూతి తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కప్పట్రాళ్ల మల్లి కార్జున మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం ఎంతో బాధాకరం. ఈ విషాద ఘటన పట్ల బాధితుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ప్రకటించారని వారు అన్నారు. ఎప్పటికైనా టీడీపీ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుంది అని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని కనకాద్రి పల్లి గ్రామంలో రాంకో సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆదేశాల మేరకు క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా గ్రామ శివాలయం సమీపంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శశిధర్ ఆధ్వర్యంలో వైద్య బృందం శిబిరానికి విచ్చేసిన 212మంది రోగులకు వైద్య సేవలు అందించారు. రెండు నెలలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. వ్యాధుల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని కోరారు. ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన పలు జాగ్రత్తలు సూచనలను తెలిపారు. కార్యక్రమంలో మైన్స్ జీఎం అజ్మల్ అహ్మద్, డిప్యూటీ మేనేజర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుందలో గురువారంశ్రీ సిద్దేశ్వర స్వామి గుడి ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు అధ్యక్షతన జరిగింది. రజక వృత్తిదారు క్యాలెండర్ ఆవిష్కరిస్తూ ఈ కార్యక్రమాని ఉద్దేశించి చాకలి మంగయ్య మహేష్ మాట్లాడుతూ.ఈ రాష్ట్రంలో రజకులకు సామాజిక భద్రత లేదని రజకుల పట్ల దాడులు మహిళలు, బాలికలపై అత్యాచారాలు నేటికీ కొనసాగుతున్నాయని వీటిని అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ మాదిరిగా సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. రజకులు కు ఇచ్చిన హామీల అమలు చేయాలని వారు అన్నారు. రాష్ట్రంలో ఇళ్ల దగ్గర వృత్తి చేసే వారందరికీ 200 యూనిట్ ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలోఉదయ్, ఎల్ఐసి లక్ష్మన్న, మంగయ్య, మల్లికార్జున, కరెంటు మల్లి, సున్నం వీరేష్, నాగప్ప, ఎల్లప్ప, శివ, శేఖర్, హనుమేష్, కృష్ణ, రమేష్, రంగస్వామి, రాజా, గాది, మల్లి, మంజు, రమేష్, రామకృష్ణ, ప్రకాష్, రాము, వీరేష్, కుబేర, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - కర్నూలు : స్థానిక మాధవ నగరలోని నారాయణ పాఠశాలలో స్కూల్ ఎజీఎం రమేష్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పండగ సంబరాలకు ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పండగ విశిష్టతను వివరించారు. పల్లె ప్రజలు ఆనందోత్సవాలతో మూడు రోజులపాటు జరుపుకునే తెలుగు పండుగ సంక్రాంతి, ఈ ఉత్సవాలను కొందరు నెలరోజులపాటు జరుపుకోగా, దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో పండుగను భోగి, మకర సంక్రాంతి, కనుమ పేర్లతో పిలుస్తారని గుర్తు చేశారు. సంక్రాంతి పండగ రైతులకు పంటలు చేతికి వచ్చే సమయం కాబట్టి తమను భోగ భాగ్యాలతో ఎప్పటికీ ఉంచమని కోరుకుంటూ ధాన్యం, పాలు కలిపి వండిన నైవేద్యంతో ఇంద్రుణ్ణి, విష్ణువుని పూజిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు గాలి పాటలు ఎగుర వేయటం, ముగ్గుల పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. చివరగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏడి వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్స్ నాగేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుండి పల్లె పండగ.. పంచాయతీ వారోత్సవాలు

విశాలాంధ్ర - తుగ్గలి: మండలంలో శుక్రవారం నుండి పల్లె పండగ-పంచాయతీ వారత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ హేమ సుందర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 10 వ తేదీ న జొన్నగిరి, కడమకుంట్ల, రాంపల్లి, వై జి తండా, శభాష్ పురం, ముక్కెళ్ల, ఎద్దులదొడ్డి, 11వ తేదీన గిరిగెట్ల, జి.ఎర్రగుడి, సీజీ తండా, చెన్నంపల్లి, గ్రామాలలో పల్లెపండగ గ్రామపంచాయతీ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, మినీ గోకులం షెడ్ల ప్రారంభోత్సవాన్ని సంబంధిత ప్రజా ప్రతినిధుల చేత చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు ప్రభుత్వ అధికారులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర - డోన్ రూరల్: రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి 2025 సంవత్సర డైరి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రైతులు, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సీడ్స్ మేనేజర్ జి.సుబ్బయ్య, టీడీపీ యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎంపీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: తిరుపతి ఘటనపై కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల జారీ నేపథ్యంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందడం తనను తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు.. ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా టిటిడి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కోరిన ఎంపి, మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. మృతి చెందిన ఒకోకరికి రూ.25 లక్షలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని ఎంపీ తెలిపారు.

భూముల రీసర్వేకు రైతులు సహకరించాలి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : గ్రామీణ ప్రాంతాలలో జరిగే భూముల రీసర్వేను రైతులు సహకరించాలని డోన్ ఆర్‌డిఓ కెపి నరసింహులు అన్నారు. గురువారం కోవెలకుంట్ల పరిధిలోని ఆమడాల గ్రామంలో ఆర్డిఓ కెపి నరసింహులు భూముల రీసర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ భూముల రి సర్వే సహకరించాలని ఆయన అన్నారు. అంతేకాకుండా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజల సమస్యల వచ్చిన అర్జీలను తక్షణమే పరీక్షించి వాటికి పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆర్వోలు, వీఆర్ఏలు రెవిన్యూ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రేక్షకుల్లో రెట్టింపు ఉత్సాహం

విశాలాంధ్ర -కర్నూలు : తెలుగు పండుగలు, ప్రత్యేక సందర్భాలను వినోదభరిత కార్యక్రమాలతో మరింత ప్రత్యేకంగా మార్చే జీ తెలుగు ఈ సంక్రాంతికి మూడు ముచ్చటైన కార్యక్రమాలతో వినోదం పంచేందుకు సిద్ధమైంది. నూతన సంవత్సరాన్ని ప్రత్యేక కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించిన జీ తెలుగు తాజాగా కాకినాడలో విక్టరీ వెంకటేష్ అతిథిగా సంక్రాంతి సంబరాలను 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' ఈవెంట్తో వైభవంగా నిర్వహించింది. అభిమానుల కోలాహలంతో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని ఈ జనవరి 11, శనివారం సాయంత్రం 6 గంటలకు, పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా జనవరి 12, ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు, సంక్రాంతి సంబరాలు ఫైర్ అండ్ వైల్డ్ ఫైర్ ప్రత్యేక కార్యక్రమం జనవరి 13, సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారం చేయనుంది.

ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీఈఓ

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు: జిల్లా పరిషత్తు ముఖ్య కార్య నిర్వహణా ధికారి జి.నాసరా రెడ్డి 2023-24 వార్షిక తనిఖీలో భాగంగా, కర్నూలు మండల పరిషత్తు కార్యాలయము నందలి రికార్డును వారి సిబ్బంది సహాయంతో తనిఖీ నిర్వహించారు. రికార్డు నిర్వహణ గురించి మండల పరిషత్తు సిబ్బందికి వివిధ సూచనలు చేయడంతోపాటు, గ్రామ పంచాయతీలలో చేతి పంపుల నిర్వహణకు సమబంధించిన పిర్యాదుల స్వీకరణకు గ్రామ పంచాయతీ కార్యాలయాలో, మండల పరిషత్తు కార్యాలయం సంబంధిత సిబ్బంది చరవాణి నెంబరును ప్రదర్శించాలని సూచించడమైనది. ఈ కార్యక్రమములో మండల పరిషత్తు అభివృద్ధి అధికారి జి.రఘునాథ్, పరిపాలన అధికారి జి.వి.చంద్రశేఖర రెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల పరిధిలోని కృష్ణ దొడ్డి గ్రామంలో వెలసిన కోనవెంకటేశ్వర స్వామి దేవాలయం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారికి అర్చన పూజ కార్యక్రమం, శ్రీనివాస గోదా కళ్యాణం, స్వామివారికి అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కోరిన కోరికలు తీర్చే కోన వెంకటేశ్వర స్వామిని వైకుంఠ ఏకాదశి దినాన్ని పురస్కరించుకొని, మండలం, గూడూరు, ఎమ్మిగనూరు తెలంగాణ ప్రాంత భక్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు తీసుకోవాలని తెలిపారు.

తిరుపతి ఘటన అత్యంత బాధాకరం

విశాలాంధ్ర - జిల్లా పరిషత్తు కర్నూలు: తిరుపతి ఘటన అత్యంత బాధాకరమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పీ మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రికా ప్రకటన విడుదల చేస్తూ వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులు తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని మృతుల కుటుంబాలకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. దేవస్థానం చరిత్రలో తొలిసారి విషాద సంఘటన అని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఈ ఘటనకు కారణమన్నారు.

కౌలు రైతు కార్డుల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర - కోడుమూరు: మండలంలోని ఎర్రదొడ్డి, గోరంట్ల, ప్యాలకుర్తి, కోడుమూరు గ్రామాలలోని కౌలు రైతు కార్డులు పొందిన రైతులకు మండల వ్యవసాయ అధికారి ఎన్ రవిప్రకాష్ ఆధ్వర్యంలో కౌలు రైతు కార్డుల వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. గురువారం మండల వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో వేరువేరుగా కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. కౌలు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులకు ముఖ్య అతిథిగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎస్.ఆర్ రామచంద్రరావు హాజరయ్యారు.

సర్వసభ్య సమావేశంలో మండిపడ్డ సర్పంచులు

విశాలాంధ్ర - పాములపాడు : మండల ఎంపీడీవో కార్యాలయంలోగురువారం ఎంపీపీ సరోజినీ వర్ధిన్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు.ఆయా శాఖల అధికారులు గత మూడు నెలల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మండల వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని రైతులకు సూచించాలని తెలిపారు. బాలికల వసతిగృహం ఎస్ డబ్ల్యు ఓ అనిత బాలికల వసతి గృహానికి త్రాగునీరు నిమిత్తం బోరును వేయాలని ఎంపీపీ, ఎంపీడీవో దృష్టికి తెచ్చారు. సెరికల్చర్ అధికారి మలబరి పంట సాగు చేసేందుకు రైతులు ముందుకు వచ్చినట్లయితే 70 నుండి 80 శాతం రాయితీ రైతులకు వస్తుందని తెలిపారు ఎకరాకు మూడు లక్షల దాకా రైతుకు లాభదాయకంగా మలబరి పంట ఉంటుందని మలబరిపై ఆసక్తి చూపిన వారికి పథకాల రాయితీని తెలియపరుస్తామన్నారు. పాములపాడు ఎస్సీ కాలనీలోని అంగన్వాడి కేంద్రం 2 ఎలక్ట్రికల్ సౌకర్యం లేదని మీటర్ బిగించకుండా బిల్లు వేస్తున్నారని కరెంటు సప్లై ఇవ్వలేదని సూపర్వైజర్ ఎంపీపీ, ఎంపీటీవో దృష్టికి తెచ్చారు స్పందించిన వారు తక్షణమే కరెంటును ఇచ్చే విధంగా ఏఈ మాట్లాడి చేస్తామని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ మాట్లాడుతూ వలసలు నివారణకు కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. ఐసిడిఎస్ ఎసిడిపిఓ మంగావళి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలు దాటిన పిల్లలకు అంగన్వాడి కేంద్రాలకు పంపాలన్నారు లోప పోషణ ఉన్న పిల్లలకు అధికంగా రేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు ఈ సందర్భంలో సర్పంచులు అంగన్వాడి కేంద్రాల నిర్మాణాలపై అడుగగా ఆయా గ్రామాలలో అంగన్వాడి కేంద్రాల కొరకు స్థలాల కేటాయింపు మధ్యలో ఆగిన బిల్డింగ్లను నివేదికను ఉన్నతాధికారులకు తెలియపరుస్తామన్నారు. పంచాయతి రాజ్ జేఈ నివేదిక ఇచ్చే సమయంలో మిట్ట కందల సర్పంచ్ చింతల నారాయణ గత ఐదు సంవత్సరాల నుండి ఆర్బికే సచివాలయం కేంద్రాలు నిర్మాణాలు బేస్ లోనే నిలిచిపోయి నిరుపయంగా ఉన్నాయని జై ఆగ్రహం వ్యక్తపరిచారు. ఎక్కడో కొత్తపల్లి మండలం గోక వరం కాంట్రాక్టర్కు జేఏఈ అంటగట్టాడని కాంట్రాక్టర్ మధ్యలో నిర్మాణం ఆపి వెళ్లిపో యారని అన్నారు ముందుగానే కాంట్రాక్టర్లు బిల్లులు చేయడంపై సర్పంచ్ ఆగ్రహం వ్యక్తపరిచారు. అంతేకాక ఇస్కాల సర్పంచ్ మౌలాలి పిఆర్జెఇపై ఆగ్రహం వ్యక్తపరిచారు ప్రోటోకాల్ పాటించకుండా సర్పంచ్ సిసి రోడ్ల నిర్మాణాలకు తీర్మానాలు తీసుకుంటాడే తప్ప ప్రభుత్వ కార్యక్రమాలకు సీసీ రోడ్డు నిర్మాణాలకు జేఈ పిలవడం లేదని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తపరి చారు. అనంతరం ఎంపీపీ ,ఎంపీడీవోలు మాట్లా డుతూ సమావేశంలో సర్పంచులు తెలియపరిచిన సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతున్న సమయంలో ఎమ్మార్పీ నాయకులు స్వాములు సమావేశంలోకి వచ్చి ఎంపీడీవో వారిస్తున్న మాట్లాడడంతో అంతా అవాక్క య్యారు ఇతరులు వచ్చి సమావేశంలో మాట్లాడడం ఏంటని అధికారులు చర్చించుకోవడం జరిగింది. డిప్యూటీ తాసిల్దార్ సుప్రియ, ఎంఈఓ సుభాషిని దేవి, సూపర్వైజర్లు వెంకటేశ్వరమ్మ, లలితా ప్రభావతి, హెల్త్ సూపర్వైజర్ అన్నమ్మ, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాల సాయి పాఠశాలలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: కంటి శుక్ల సమస్యపై నిర్లక్ష్యం వహించరాదని కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాష్ అన్నారు. బాల సాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బాల సాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్లివిన్ జోన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బాలసాయి ఉచిత పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి 50 మందికి పైగా అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ డిజిటల్ స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడపడం వల్ల కంటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అస్పష్టమైన దృష్టి, కళ్ళు పొడిగా మారడం, కళ్ళు తరచు ఎర్రబడడం,తలనొప్పి రావడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యుని సంప్రదించాలన్నారు. విజయలక్ష్మి, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన సేవలను క్షేత్రస్థాయిలో అందించాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సేవలను అందించాలని ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని తహశీల్దార్ కార్యా లయాన్ని ఆర్డీఓ సందీప్ సందర్శించి ఇన్చార్జి తహసిల్దార్ పురుషోత్తముడు అధ్యక్షతన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి సెలవుల్లో ఉన్నారని తెలిసి సమీక్షలో భాగంగా రైతులకు, ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన సేవలు క్షేత్రస్థాయిలో అందించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. అంతేకాకుండా భూ సమస్యలు, రస్తా వివాదాలు, ఆన్లైన్ సేవలు, భూ సర్వేలు, పక్కదృందిగా నిర్వహించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ తహశీల్దార్ పురుషోత్తముడు, ఆయా గ్రామాల వీఆర్వోలు తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫాతిమా షేక్ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-పత్తికొండ: భారతదేశ మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఫాతిమా షేక్ చేసిన సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భ్రమరాంబ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఫాతిమా షేక్ 194వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయనీయ బృందం ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యురాలు మాట్లాడుతూ ఫాతిమా షేక్, భారతీయ విద్యావేత్త సంఘసంస్కర్తలైన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలతో కలిసి పని చేశారని తెలిపారు. ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సాంస్కృతిక మహోత్సవంను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు ఫిబ్రవరి 5, 6న టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాజమండ్రి నన్నయ విశ్వవిద్యాలయం లో నిర్వహిస్తున్న కరపత్రాలను గురువారం క్లస్టర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి డి వి ఆర్ సాయిగోపాల్ చేతుల మీద విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఒక భాగంగా ఉన్నాయని వాటిని పరిరక్షించే బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని అన్నారు.

రిడ్జ్ పాఠశాలలో 16వ జాతీయ జూనియర్ రోల్ బాల్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమకు తలమానికమైన కర్నూలు నగరంలో రోల్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో మొట్ట మొదటి సారిగా 16వ జాతీయ జూనియర్ రోల్ బాల్ కప్ ప్రారంభమైనది. స్థానిక లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాల ఆవరణం ఈ కార్యక్రమానికి వేదిక అయినది. ఆర్బిఎఫ్ఐ జాతి ఉపాధ్యక్షులు మరియు రాష్ట్ర అధ్యక్షులు అయిన బిజెపి నాయకులు జి.చంద్ర మౌళి ఆధ్వర్యంలో ఈ క్రీడలు నిర్వహించబడు చున్నవి. జనవరి 9న ప్రారంభమైన ఈ కార్యక్రమం 11వ తేదీ సాయంకాలం ముగింపు సభ తో పూర్తి కానున్నది. 9 వ తేదీ ఉదయం జరిగినటువంటి ప్రారంభోత్సవం లో ముఖ్యఅతిథిగా రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, శ్రీ నగరూరి రాఘవేంద్ర, చంద్రమౌళి, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ఆర్బీఎఫ్ఐ శిక్షకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. దేశంలోని నలుమూలల నుండి 20 రాష్ట్రాల నుండి వచ్చిన సుమారు 640 మంది క్రీడాకారులు ఈ పోటీలలో తలపడనున్నారు. సుదూర రాష్ట్రాలైన జమ్మూ కాశ్మీర్, అస్సాం, ఝూర?ండ్ , ఒరిస్సా, మేఘాలయ వంటి రాష్ట్రాల నుండి కూడా క్రీడాకారులు పాల్గొనడం ఈ కార్యక్రమం యొక్క విశేషం. ప్రారంభ ఉపన్యాసంలో ముఖ్య అతిథి అయిన జి.పుల్లయ్య మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులకు, క్రీడాకారులకు స్వాగతం పలుకుతూ వారి క్రీడా స్ఫూర్తిని అభినందిస్తూ ఇటువంటి కార్యక్రమాలు అనేకం నిర్వహించవలసినటువంటి ఆవశ్యకత ఉందని తెలియజేశారు. రిడ్జ్ పాఠశాల యాజమాన్యంగా 20 రాష్ట్రాలకు సంబంధించిన క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వడం తమకు సంతోషాన్ని, స్ఫూర్తినిచ్చిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిడ్జ్ పాఠశాల సీ.ఈ.ఓ గోపినాథ్, కోసిఈఓ సౌమ్య గోపినాథ్, పాఠశాల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్ కమల్, నిర్వాహకులు సునీల్ రెడ్డి, మంజునాథ్, అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

దేశ ఐక్యతకు పునాది రాజ్యాంగం సీపీఐ (ఎమ్మెల్) లిబరేషన్

విశాలాంధ్ర - ఆత్మకూర్ రూరల్ : రాజ్యాంగంపై బీజేపీ కుట్రలను తిప్పికొడదాం సిపిఐ(ఎమ్మెల్) లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద కరపత్రాలు విడుదల చేసిన సిపిఐ(యంయల్) లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు ఐస జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున దేశ సమైక్యత, మతసామరస్యం, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం ప్రగతి బాటలో ముందుకు అడిగేద్దామని, భారత రాజ్యాంగం పై బిజెపి కుట్రలను తిప్పి కొట్టి భారత రాజ్యాంగాన్ని కాపాడుదామని దేశాన్ని రక్షించుకుందామని సిపిఐ (ఎమ్మెల్) లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున అన్నారు. ఈ మేరకు ఆత్మకూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద 'రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. స్వేచ్ఛ, సామరస్యం, సమానత్వం నెలకొల్పినప్పుడే ఏ దేశమైన అభివృద్ధి చెందుతుంద న్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాం గానికి, మహిళలకు, విద్యార్థులకు ఎవరికీ రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మనమంతా భారతీ యులైన మనం మత స్వేచ్ఛను గౌరవిద్దాం అంటూ రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, దేశాన్ని రక్షించు కుందాం అంటూ జనవరి 20 తేదీన కర్నూలు అంబేద్కర్ భవన్‌లో రాయ లసీమ జిల్లాల రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో సిపిఐ(యంయల్) లిబరేషన్ ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఏఐసిసిటీయూ నాయకులు షేక్షావలి ఐసా ఆత్మకూరు డివిజన్ అధ్యక్షులు వర్ధన్ నగర నాయకులు అజయ్, రాజేష్, వంశీ, అంజి తదితరులు పాల్గొన్నారు.